క్లుప్తంగా

నేడు పవిత్రోత్సవాలకు అంకురార్పణ

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలం అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం అంకురార్పణతో పవిత్రోత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ అధికారి శివకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో భక్తులు, సిబ్బంది వల్ల తెలిసో, తెలియక జరిగిన దోషాల నివృత్తి కోసం పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈనెల 10న పవిత్ర ప్రతిష్ఠ, 11న పవిత్ర సమర్పణ, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 12న మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన జరుగుతుందన్నారు. పవిత్రోత్సవాల సందర్భంగా రోజూ ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించడం జరుగుతుందన్నారు. పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

బెట్టింగ్‌కి పాల్పడితే కఠిన చర్యలు


సీఐ లక్ష్మీనారాయణ

పుత్తూరు రూరల్: వరల్డ్ కప్ మ్యాచ్ జరుగుతున్న నేపథ్యంలో ఎవరైనా ఆన్‌లైన్ ద్వారా గానీ, ప్రత్యక్ష బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సర్కిల్ పరిధిలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బెట్టింగులకు పాల్పడి డబ్బు పోగొట్టుకుని, ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. విద్యార్థులు ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొని భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎవరైనా, ఎక్కడైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం చేరవేయాలని కోరారు.

ఈకేవైసీ చేయించుకోండి

విజయపురం (నగరి): మండలంలో ఈకేవైసీ చేయించుకోని రైతులు ఎవరైనా ఉంటే వీలైనంత త్వరగా నమోదు చేసుకోవాలని ఏఓ రజనీ కుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే రైతు భరోసా పథకానికి అర్హత కలిగిన రైతులు ఆర్‌బీకేలో భూమి పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్ కాపీలు ఇచ్చి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఇదివరకు రైతు భరోసా తీసుకుని, మృతి చెందిన వారు ఎవరైనా ఉంటే వారికి సంబంధించిన వారసులు పట్టాదారు పాసుపుస్తకం తీసుకుని నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

1.5 టన్నుల పొడిచెత్త తరలింపు



వాహనాన్ని జెండా ఊపి తరలిస్తున్న కమిషనర్

నగరి : నగరి మున్సిపాలిటీలో పోగైన చెత్తకుప్పలో విభజించిన 1.5 టన్నుల పొడిచెత్తను జువారీ సిమెంటు ప్లాంటుకు తరలించారు. ఆదివారం చెత్తను తీసుకెళ్లే కాంపాక్టర్ వాహనాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి జెండా ఊపి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ వారి ఆదేశాల మేరకు డ్రైవేస్ట్ మేనేజ్‌మెంట్ (పొడిచెత్త నిర్వహణ) పథకంలో భాగంగా చెత్తను తరలించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, చంద్రకాంత్, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

రాయలసీమ జన జీవన కథా చిత్రమే సగిలేటి కథ


మాట్లాడుతున్న హీరో రవి

తిరుపతి కల్చరల్: రాయలసీమ జన జీవన శైలితో పాటు సంప్రదాయాలను ఆవిష్కరిస్తూ సరికొత్త పంథాలో ప్రేక్షకులను ఆకట్టుకునే చక్కటి ఎంటర్‌టైమెంట్ కథా చిత్రం సగిలేటి కథ అని దర్శకుడు రాజశేఖర్ తెలిపారు. ఈ నెల 13వ తేదీన సగిలేటి కథ చిత్రం విడుదల కానుంది. ఈక్రమంలో ఆయన ఆదివారం సాయంత్రం చిత్రం యూనిట్ సభ్యుల తో ఒక హోటల్లో మీడియాతో మాట్లాడారు. తాను తిరుపతి వాసినని తెలిపారు. తొలిసారి కొత్త హీరో రవి మహాదశం, హీరోయిన్ విహిక, రాయలసీమకు చెందిన నటులతో సినిమాను రూపొందించినట్టు తెలిపారు. రాయలసీమ ప్రజల సంప్రదాయాలు, జీవన శైలిని వివరిస్తూ రూపొందించిన చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈనెల 13న విడుదలవుతున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. హీరో రవి మహా దశం మాట్లాడుతూ రాయలసీమ అంటే ఫ్యాక్షనిజం అనే తరహాలో చిత్రాలు వచ్చాయని, వాటికి భిన్నంగా రాయలసీమ ప్రజల జీవన శైలి, సంప్రదాయాలను ఆవిష్కరిస్తూ రెండు గంటల సేపు చక్కటి ఆనందాన్ని పంచేలా ఈ చిత్రం ఉంటుందన్నారు. సమావేశంలో చిత్ర నిర్మాత దేవిప్రసాద్, సంగీత దర్శకుడు జశ్వంత్, నటులు పాల్గొన్నారు.

పుట్టిన ఊరి రుణం తీర్చుకుంటా..



మంత్రి నారాయణస్వామికి తన సొంత గ్రామం పాదిరికుప్పంలో క్రేన్‌తో భారీ గజమాలను వేసి స్వాగతిస్తున్న గ్రామస్తులు, మంత్రి నారాయణస్వామికి గజమాలను వేస్తున్న నాయకులు

- వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించాం
- వచ్చే ఎన్నికల్లో మరోమారు జగనన్నను సీఎంను చేసుకుందాం
- మంత్రి నారాయణస్వామికి సొంత ఊరు పాదిరికుప్పంలో ఘనస్వాగతం

కార్వేటినగరం: మండలంలోని పాదిరికుప్పంలో జాతర వాతావరణం కనిపించింది. ఆదివారం గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సంబరాలను తెచ్చింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి స్వగ్రామమైన పాదిరికుప్పంకు వస్తుండడంతో గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు వీధులను మామిడి ఆకులు, బంతి పూల తోరణాలతో సుందరంగా అలంకరించారు. గ్రామంలో ప్రతి ఇంటిపై వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. యువత బాణసంచాలు పేల్చి, బ్యాండు వాయిద్యాల నడుమ మంత్రికి ఘన స్వాగతం పలికికారు. మొదట గ్రామ దేవత నడివీధి గంగమ్మను మంత్రి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటా అక్కచెల్లెమ్మలు, మంగళ హారతులు ఇచ్చారు. ఆప్యాయంగా వారిని ఆయన పలకరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేనివిధంగా 45 సంవత్సరాల కిందటే దళితవాడలో ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలను తీసుకొచ్చి విద్యావంతులుగా మార్చానని, నేడు ప్రతి ఇంటా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనతో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించామని, వచ్చే ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసుకుందామని తన సొంత ఊరి ప్రజలకు పిలుపునిచ్చారు.

రూ.4 కోట్లతో అభివృద్ధి..

పాదిరికుప్పంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి సుమారు రూ.4 కోట్లు వెచ్చించడం జరిగిందని మంత్రి నారాయణస్వామి తెలిపారు. అలాగే గ్రామంలో నూతనంగా వివాహాలు అయిన వారిని గుర్తించి రేషన్‌కార్డులు, ఇంటి పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్ రవి కుమార్‌ను ఆదేశించారు. తాను పుట్టి పెరిగిన ఈ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి సమస్య రహిత గ్రామంగా తీర్చిదిద్ది రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు అందని అర్హులను గుర్తించి ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి హోదాను మరిచి, తన చిన్ననాటి స్నేహితులతో ముచ్చటించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆయన ఆనందంగా గడిపారు.

క్రేన్‌తో గజమాలలు వేసి..

మంత్రి నారాయణస్వామిమి తన సొంత గ్రామం పాదిరికుప్పంలో ఘన స్వాగతం లభించింది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసులు, దేశయ్య, దాము, చరణ్, చంద్రశేఖర్, చిరంజీవి తదితరులు క్రేన్‌తో మంత్రికి గజమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లత, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, దివ్య, ఉప సర్పంచ్ వెంకటస్వామి, రాజారత్నం, జబ్బారయ్య, అములయ్య, సుబ్రమణ్యం, చంద్రశేఖర్, తురకాణమ్మ, జిల్లా కార్యదర్శి గోపి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణయాదవ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : మండలంలో పలు కారణాలతో మరణించిన వారి కుటుంబ సభ్యులను డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శించారు. పెద్దతయ్యూరు దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కె.గిరి (35) శనివారం రాత్రి గుండెపోటుతో మరణించారు. అలాగే సీకే పురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గురవయ్య(80) అనారోగ్యంతో మరణించారు. సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ఆదుకుంటామని భరోసా కల్పించారు. మంత్రి వెంట జెడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, స్థానిక సర్పంచ్ వరదమ్మ, మండల కన్వీనర్ మణి, కాపు సంఘ అధ్యక్షుడు విజయాబాబు, నాయకులు సూరిరెడ్డి, కోటిరెడ్డి బాబు, డిసెంబర్‌శెట్టి, సుబ్రమణ్యం, తులసిమణి, మణి, నారాయణస్వామి, శివలింగం, రవి, నవీన్ తదితరులు ఉన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

విజయపురం (నగరి): మండల కేంద్రంలోని జగన్నాథపురం సచివాలయ పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ సోమశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటింటి సర్వేలో వైద్య పరీక్షలు చేసుకున్న వారు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యశిబిరం ఉంటుందన్నారు. అనుభవం కలిగిన డాక్టర్ల చేత వైద్య పరీక్షలు అందించి మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

శాంతి భద్రతలపై అవగాహన కల్పించాలి


పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రవికుమార్

పాలసముద్రం : ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో గ్రామాల్లో శాంతి భద్రతలపై ప్రజలు అవగాహన కల్పించాలని నగరి డివిజన్ డీఎస్పీ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను నిశితంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికే ఎన్నికల వాతావరణం నెలకొందన్నారు. అందువల్ల ప్రతి గ్రామంలో ప్రజలు శాంతియుత వాతావరణంలో ఉండేలా చూడాల్సిన బాధ్యత పోలీస్‌శాఖపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఎవరికి నచ్చిన పార్టీకి వారి ఓటు వేసుకుని, ప్రశాంత వాతారణంలో జీవనం సాగించేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. పాలసముద్రం మండలం తమిళనాడు సరిహద్దులో ఉన్నందున అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందని, ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. పల్లెల్లో నాటుసారా తయారీ, విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట కార్వేటినగరం సర్కిల్ సీఐ సత్యబాబు, ఎస్‌ఐ ప్రసాద్, కోర్టు కానిస్టేబుల్ బాషా ఉన్నారు.

త్రైత సిద్ధాంతంతో ఆధ్యాత్మికత పెంపు


సీఐ సురేష్‌కు భగవద్గీత పుస్తకాన్ని అందజేస్తున్న కమిటీ అధ్యక్షుడు సురమౌళి

నగరి : ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదించడానికే త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి ప్రచారం చేస్తున్నట్లు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక తెలిపారు. ఆదివారం వారు భగవద్గీత పుస్తకాలను నగరి సీఐ సురేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఈ నెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు త్రైత సిద్ధాంతం భగవద్గీత గురించి ప్రచారం చేస్తున్నట్లు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ, బంగారుపాళ్యం కమిటీ, వి.కోట కమిటీ అధ్యక్షుడు డి.సురమౌళి, డి.బాలాజీ, కే.అశోక్ బాబు తెలిపారు. నియోజవర్గంలో నిర్వహించే కార్యక్రమాల వివరాలను వారు తెలియజేశారు. ప్రచారానికి సంబంధించిన సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. భగవద్గీత ప్రచారం కోసం దాదాపు 300 మంది భక్తులు వస్తారని, ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామాల్లో ప్రచారం చేస్తామన్నారు.



వరినాట్లు వేసేందుకు నారు పెరుకుతున్న కూలీలు, శ్రీకావేరిరాజుపురంలో వరి సాగు చేయడానికి అంద తీస్తున్న కూలీలు

నాగలి కట్టి.. నాట్లు వేసి..

పాలసముద్రం : ఆరుగాలం శ్రమించే అన్నదాతపై వరుణదేవుడు దయ చూపుతున్నాడు. రబీ సీజన్ ప్రారంభ దశ నుంచే వర్షాలు పడుతుండడంతో అన్నదాతలు నాగలి కట్టి పొలాలను దుక్కులు చేసేందుకు శ్రమటోడుస్తున్నారు. తాజాగా గత రెండు, మూడు రోజులుగా కురిసిన వర్షాలకు 40.5 మిమీ. వర్షపాతం పడింది. దీంతో రైతన్నలు గత రెండు రోజులుగా వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. భూగర్భజలాలు సైతం పెరగడంతో పంట పూర్తయ్యే మూడు, నాలుగు నెలల వరకు బోరు, బావుల్లో నీరు పుష్కలంగా వచ్చే అవకాశం ఉంది. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 66 హెక్టార్లలో వరి సాగు చేయగా, ప్రస్తుతం రబీ సీజన్‌లో 125 హెక్టార్లలో సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. తాజాగా వర్షం పడడంతో గతంలో దుక్కులు సిద్ధం చేసుకున్న వారు వరినాట్లు వేస్తున్నారు. నాట్లు వేయడానికి మహిళా కూలీల అవసరం ఎక్కువ. దీంతో డిమాండ్ పెరిగింది. అయితే మరికొంతమంది రైతులు మాత్రం డ్రమ్‌సీడర్ పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో 100 రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్న మహిళలు వరినాట్లు, కలుపు తీసే పనులకు వెళ్తున్నారు.



ఏటుకూరిపల్లెలో వరినాట్లు వేస్తున్న మహిళలు, పంట సాగు కాడెద్దులతో పొలాన్ని చదును చేస్తున్న రైతు

సంక్షేమం కావాలంటే జగన్ కావాలి

- ప్రతి పేదవాడి మోములో చిరునవ్వు చెరిగిపోకూడదంటే మళ్లీ జగన్ రావాలి
- రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌కే సెల్వమణి


సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

నగరి : అభివృద్ధి, సంక్షేమం కొనసాగేందుకు ఆంధ్రప్రదేశ్‌కు జగన్ కావాలని రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి అన్నారు. ఆదివారం మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డితో కలిసి నగరి పట్టణంలోని ఏజేఎస్ కల్యాణ మండపంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి ? అనే అంశంపై నగరి మండల, మున్సిపల్ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు శిక్షణా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడి మోములో చిరునవ్వు చెరిగిపోకూడదంటే జగన్ పాలన కొనసాగాలని తెలిపారు. నాయకుల నుంచి సాధారణ కార్యకర్త వరకు జగనన్న సామ్రాజ్యానికి పునాదులే అన్నారు. జగనన్న సీఎం కాగానే సంక్షేమ సామ్రాజ్యాన్ని స్థాపించి మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబాలను సంక్షేమ పథకాలతో ఆదుకుంటూ సువర్ణ పాలన అందిస్తున్నారని తెలిపారు. ఇన్ని మంచి పనులు జరుగుతున్నా ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రతిపక్షాలు అసత్యపు ప్రచారాలు చేస్తూ అబద్ధాన్ని పలుమార్లు చెప్పి దాన్ని నిజం అని నమ్మించే ప్రయత్నం చేస్తోందన్నారు. దాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ప్రతి పౌరుడికి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు ప్రత్యక్షంగా చెప్పడానికే ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యత పార్టీ శ్రేణులపైనే ఉందన్నారు. మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ నేడు రాష్ట్ర ప్రజలంతా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ సంతోషం ఇలాగే కొనసాగాలంటే ఏపీకి జగనన్న మళ్లీ సీఎం కావాల్సిందేనని తేల్చి చెప్పారు. ప్రతి సచివాలయ పరిధిలో జరిగిన సంక్షేమ గణాంకాలు తెలిపే వివరాలు అంకెలతో సహా చూపడం జరుగుతుందన్నారు. ఇదే జగనన్న చేసిన మంచి పనులకు తార్కాణంగా నిలుస్తుందన్నారు. అందరూ కలసికట్టుగా ఏకతాటిపై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మన గెలుపు ఇప్పటికే ఖాయమైందన్నారు. కార్యక్రమంలో నగరి మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్లు బాలన్, వెంకటరత్నం రెడ్డి, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, డిల్లీ, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మున్సిపల్ కన్వీనర్ బీఆర్వీ అయ్యప్పన్, మున్సిపల్, మండల సచివాలయ కన్వీనర్లు దయానిధి, హరి, నాయకులు బీడీ భాస్కర్, మురుగ, ఇంద్రయ్య, మోహన్‌రాజ్, ప్రకాష్, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.